క్లుప్తంగా

నేడు కల్తీ మద్యంపై ధర్నా


అంబటి రమేష్

ఆకివీడు: రాష్ట్రంలో ఏరులై పారుతున్న కల్తీ మద్యాన్ని అరికట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షులు అంబటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యం తయారు చేయించి, వాటిని మార్కెట్‌లో విక్రయించి ప్రజల ఆరోగ్యంతో, ప్రాణాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తంచేశారు. కల్తీ మద్యం కుంభకోణంలో టీడీపీ నాయకుల పేర్లు బయటకు వచ్చినప్పటికీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. కల్తీ మద్యం అరికట్టేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పీవీఎల్.నర్సింహరాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు.

ప్రతి విద్యార్థీ ఒక మొక్కను నాటాలి


భీమవరంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

భీమవరం: పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని, కాబట్టి ప్రతి విద్యార్థీ కనీసం ఒక మొక్క నాటి సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని భీమవరం శ్రీ భీమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్ అన్నారు. పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆవరణలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దాసాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ దారపురెడ్డి త్రివిక్రమ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ బి మావుళ్లు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

భీమవరం(ప్రకాశంచౌక్): అన్ని దానాలకంటే అన్నదానం ఎంతో గొప్పదని, దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక నాచువారి సెంటర్ లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఒంటెద్దు బళ్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా మహా నివేదనకు హారతులు ఇచ్చి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు యూపీఎఫ్ మండల సమావేశం

ఉండి: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిఫ్(యుపీఎఫ్) మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి చెరుకువాడ సమస్త జనుల యేసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో రెవరెండ్ ఎరిచెర్ల ఇస్మాయేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పాస్టర్ సోడదాసి పీటర్, పాస్టర్ వై.యోనాతాను తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ పాస్టర్స్ ఫెలోషిఫ్ ప్రధాన కార్యదర్శి బ్రదర్ మేడిద జాన్సన్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి యుపీఎఫ్ సభ్యులంతా విధిగా హాజరుకావాలని వారు కోరారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

భీమవరం: వీఓఏలను భయపెట్టడానికి పాలకులు తీసుకొచ్చిన కాల పరిమితి సర్క్యులర్‌ను అనేక పోరాటాలు చేసి రద్దు చేయించుకున్నామని వీఓఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నిర్మలాదేవి అన్నారు. ఆదివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వీఓఏలకు కనీస వేతనాలు పెంచాలని, పని ఒత్తిడి తగ్గించాలని, సెల్ ఫోన్స్ ఇవ్వాలని తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు, జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ, సీఐటీయూ జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్, దుర్గాదేవి, పుష్పలత, కె.సత్య, ఉషాకళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

యలమంచిలి: మండలంలోని నారినమెరక పంచాయతీ గమళ్లపెంటలో పేకాడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు ఆదివారం యలమంచిలి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8140 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఈతకోట సత్యనారాయణ తెలిపారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్

పాలకోడేరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. గొల్లకోడేరు, గరగపర్రు గ్రామాల్లో పార్టీ కార్యాలయాల వద్ద మండలపార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చెల్లబోయిన పాపారావు,చేకూరి నరేంద్రరాజుల ఆధ్వర్యంలో ఆదివారం సంబంధిత కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ మాజీ సీయం జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో ప్రతి జిల్లాకు మెడికల్‌కళాశాల తీసుకువస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ అనుచరులు, బినామీలకు దోచిపెట్టేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. పీపీపీ విధానం అంటూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ నెల10 నుంచి నవంబర్ 22 వరకు రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, సంతకాలు సేకరిస్తామని వివరించారు. ఈ నెల 23 నుంచి నియోజకవర్గకేంద్రంలో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే మెరుగైన వైద్యం ఎలా అందుతుంది? ఆయన ప్రశ్నించారు.


గరగపర్రులో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు


గొల్లలకోడేరులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

కన్వీనర్లు, సోషల్ మీడియా అధ్యక్షుల ఎన్నిక

చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అతివృష్టి, లేకపోతే అనావృష్టి వచ్చి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామను బంధ విభాగాల కన్వీనర్లు,సోషల్ మీడియా అధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ సమావేశాల్లో పార్టీ మండల ఉపాధ్యక్షుడు చేకూరి రాజనరేంద్రకుమార్, జిల్లా ఎస్సీ సెల్ సభ్యుడు నామాల శ్యామ్‌కుమార్, నియోజకవర్గ బూత్‌కమిటీ కన్వీవర్ పాలా రాధాకృష్ణ, పాలా లక్ష్మీ, గొల్లలకోడేరు గ్రామాధ్యక్షుడు చిలువూరి గనిగోపాలరాజు, సర్పంచ్‌లు కుక్కల లక్ష్మీ, బొల్లా శ్రీనివాస్, ఉపసర్పంచ్ నేతల సునీతసాల్మన్‌రాజు, ముదునూరి వెంకటరామరాజు(రాము), చింతలపాటి బలరామరాజు, గుంటపల్లి వెంకన్న, కముజు పండు, గరగపర్రు అబ్బులు, సత్యాల రోజమ్మ, గుత్తుల ఏడుకొండలు, గండి అనిల్‌కుమార్, పార్టీ అనుబంధ అధ్యక్షులు గాదిరాజు వీరభద్రరాజు, కోనాల రాజా, మత్తి సందీప్, పంది దివ్య, కుక్కల సత్యనారాయణ, నేతల సాల్మన్, నాయకులు అడబాల సత్యనారాయణ, గుబ్బల నరసింహారావు, మధు, ఏసు, శాంతారావు, నామాల సామేలు, గాడిపల్లి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ రచ్చబండ

వీరవాసరం: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కొనసాగుతోంది. మండలంలోని ఎం.పోలవరం, అండలూరు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో వీరవాసరం మండల అధ్యక్షుడు చవ్వాకుల సత్యనారాయణ, మండల మాజీ కన్వీనర్ నేతల సుందరరాజు, మండల ఉపాధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు బి.శ్రీను, ఎం.శ్రీనివాస్, టి.చిట్టిబాబు, బి.పరమేశ్వరరావు, బండి బాలాజీ, ఎం.పట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ పార్టీ ఇన్‌చార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు ఆదివారం వీరవాసరం మండలంలో పలువురిని పరామర్శించారు. మడుగు పోలవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు పానుకు అశోక్ బాబు కుమారుడు పానుకు సుమన్(25) ఇటీవల మరణించడంతో జొన్నలపాలెంలోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ పార్టీ మాజీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు తండ్రి కడలి సత్యనారాయణ(70) ఇటీవల మృతి చెందడంతో రాయకుదురులోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణ మూర్తి, మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందర్ రాజు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వీరవల్లి ప్రవీణ్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు కడలి శ్రీరాములు, జిల్లా బూత్ ఇంచార్జ్ డీవీడీ ప్రసాద్, పానుకు రాజా పాల్గొన్నారు.


రచ్చబండ కార్యక్రమంలో సంతకాలను సేకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కడలి ధర్మారావును పరామర్శిస్తున్న చినమిల్లి వెంకట్రాయుడు

నేడు కల్తీ మద్యం విక్రయాలపై నిరసన

భీమవరం: కల్తీ మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు భీమవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు రాయలం గ్రామం నుంచి ప్రదర్శనగా భీమవరంలోని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుంటామని పార్టీ శ్రేణులు రాయలం చేరుకోవాలని వెంకటరాయుడు కోరారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడిన పొన్నపల్లి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం కేశవరం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గత నెల 30న తన గ్రామం నుంచి సొంత పనిపై తన భార్యతో కలిసి మోటారు సైకిల్‌పై భీమవరం వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రకాశం చౌక్ సెంటర్‌లో మరో మోటారు సైకిల్‌పై నిర్లక్ష్యంగా వస్తున్న వ్యక్తి శ్రీనివాసరావు మోటారు సైకిల్‌ను ఢీ కొట్టాడు. ప్రమాదంలో శ్రీనివాసరావు కాలువిరిగడంతో పాటు పలు చోట్ల గాయాలయ్యాయి. దీంతో బాధితుడు శ్రీనివాసరావు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు.

15న బీఎస్ఐ సమావేశం

ఉండి: భీమవరంలో ఈ నెల 15న నిర్వహించే బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ)ఆకివీడు బ్రాంచ్ సమావేశానికి తరలిరావాలని బీఎస్ఐ నాయకులు బ్రదర్ ఈలి డేవిడ్‌మార్క్, బ్రదర్ జార్జ్‌ముల్లర్, బ్రదర్ జ్ఞానప్రకాష్ కోరారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2:30 గంటలకు భీమవరంలోని ఇండస్ట్రియల్ ఏరియాలోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ చర్చ్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆగ్జిలరీ చైర్మన్ బ్రదర్ మేడిద జాన్సన్ హాజరవుతారని వివరించారు.

నేడు ఉండిలో కోటి సంతకాల కార్యక్రమం

ఉండి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని సోమవారం ఉండి పెదపేటలో ప్రారంభిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు పాల్గొంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఆకివీడులో అకాల వర్షం


పెదపేటలోని హాస్టల్ ప్రాంగణంలో నిలిచిన నీరు


సంతపేటలో నీట మునిగిన రోడ్డు

ఆకివీడు: అకాల వర్షం ఆకివీడును అతలాకుతలం చేసింది. మధ్యాహ్నం వరకూ గ్రీష్మతాపానికి ప్రజలు అల్లాడిపోగా ఒక్కసారిగా వాతావరణం చల్లని గాలులతో సాయంత్రానికి కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు వీధుల్లో డ్రెయిన్లు పొంగి ప్రవహించాయి. రోడ్లపై నీరు నిలబడింది. ఆదివారం కావడంతో ప్రజలకు అంత ఇబ్బంది కలుగలేదు. కుండపోత వర్షానికి స్థానిక పెదపేటలోని ఎస్‌సీ హాస్టల్ ప్రాంగణం నీటితో నిండింది. ఈ ప్రాంతంలో మట్టి వేసి ఎత్తు చేయాల్సి ఉంది. డ్రెయినేజీ నీరు, వర్షపు నీటితో ప్రాంగణం నిడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై దాడి అమానుషం

ఆకివీడు: రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై దాడి చేసిన విధంగా ఇటీవల సంఘటనలున్నాయని సీబీసీఎన్‌సీ రాష్ట్ర కార్యదర్శి, ఫీల్డ్ కౌన్సిల్ కార్యదర్శి గూడపాటి జోసఫ్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహంపై పెట్రోల్ పోసి అంటించిన సంఘటనతో పాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి నిరసన వ్యక్తంచేస్తూ ఆదివారం స్థానిక ప్రధాన సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకంచేసి, పూలమాల వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా అన్ని వర్గాలకూ ఆయన సమాన ప్రాతినిధ్యంకల్పించారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలిస్తున్నాయన్నారు. అలాంటి వ్యక్తిని కించపరచే విధంగా పెట్రోల్ పోసి అంటించడం దారుణమైన సంఘటన అని మండిపడ్డారు. దీనిని ప్రతిఒక్కరూ ఖండించి, దుర్ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేయడం న్యాయవ్యవస్థను కించపరచడమేనన్నారు. న్యాయం, ధర్మాన్ని పరిరక్షించే న్యాయమూర్తులపై దాడి సహించరానిదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.ఆనంద్, కృష్ణంరాజు, బి.వెంకటేశులు, మాణిక్యం, ఎలిషా, నాగేశ్వరరావు, ప్రభాకరరావు, ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

వీరవాసరంలో ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: పట్టణంలో శ్రీ సీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన సీనియర్ పిరమిడ్ గ్రాండ్ మాస్టర్ కేవీ రావు పాల్గొని జ్ఞానబోధ చేసి ధ్యానశిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కో-ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ నవంబరు 14,15,16 తేదీలలో వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల ధ్యానయజ్ఞం ఇదే దేవస్థానం ప్రాంగణంలో ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మద్దాల శ్రీరామకృష్ణ, మేడిశెట్టి కృష్ణారావు, ఎస్.ఉదయ్, కె.మోహన్, వి.విశ్వేశ్వరరావు, కృష్ణవేణి, యర్రాయమ్మ తదితరులు పాల్గొన్నారు.


వీరవాసరంలో ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

కల్తీ మద్యాన్ని అరికట్టాలి

భీమవరం: రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టి, మద్యాన్ని ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తున్న షాపులపై తక్షణం చర్యలు తీసుకోవాలి సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బి.త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వాసుదేవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక మద్యం ఏరులై పారుతుందని మండిపడ్డారు. స్పిరిట్‌తో పేదవారే లక్ష్యంగా కల్తీ మద్యం తయారు చేసి విచ్చల విడిగా విక్రయాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీమద్యం విక్రయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. కల్తీ మద్యం తాగి ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే ప్రమాదం ఏర్పడిందని వెంటనే కల్తీ మద్యం అరికట్టే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే విస్తృతంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి ప్రజలతో బలవంతంగా మద్యం తాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నిధులు నిలుపుదల చేయడంతో హాస్పిటల్స్‌లో వైద్యం, సరైన సౌకర్యాలు అందట్లేదని, పేదలపై వైద్యం ఖర్చులు మరింత దారుణంగా పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో కల్తీ మద్యం అరికట్టకపోతే ఎక్సైజ్ ఆఫీసుల వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.నాగేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10:30 గంటలు నుంచి అందించాలని కోరారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు

తణుకు అర్బన్: కార్తీకమాసం సందర్భంగా తణుకు ఆర్టీసీ డిపో నుంచి పుణ్య క్షేత్రాలు, విహార యాత్రలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. పంచారామాలకు ఈ నెల 26, వచ్చే నెల 2, 9, 16 తేదీల్లో రాత్రి 7 గంటలకు బస్సులు బయలు దేరి కార్తీక సోమవారం రోజున దర్శనాల అనంతరం తిరిగి తణుకు చేరుకుంటాయని వివరించారు. టికెట్ ధర పల్లె వెలుగు రూ.720, సూపర్ లగ్జరీ రూ.1200, ఏకాదశ రుద్రుల దర్శనం కోసం కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఉదయం 6 గంటలకు తణుకులో బయలుదేరి 11 శైవ క్షేత్రాల దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం 6 గంటలకు తణుకు చేరుతాయని చెప్పారు. టికెట్ ధర కేవలం రూ.350 మాత్రమేనని, కార్తీకమాసంలో ప్రతి ఆదివారం మన్యసీమ విహార యాత్ర స్పెషల్ ఏర్పాటు చేశామని ఈ బస్సులు ఆదివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి విహార యాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు తణుకు చేరుతాయని స్పష్టం చేశారు. టికెట్ ధర పల్లెవెలుగు రూ.300, సూపర్ లగ్జరీ రూ.500, అలాగే విశాఖ విహార యాత్ర స్పెషల్స్ కూడా ఏర్పాటు చేశామని కార్తీకమాసంలో ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు తణుకులో బయలుదేరి ఆదివారం విశాఖపట్నంలోని సుప్రసిద్ధ సందర్శనీయ విహారయాత్ర ప్రదేశాల దర్శనానంతరం సోమవారం ఉదయం తణుకు చేరుతాయని వివరించారు. టికెట్ ధర సూపర్ లగ్జరీలో పెద్దలకు రూ. 1050, పిల్లలకు రూ.800గా ఉన్నాయని వివరించారు.

డిగ్రీ నుంచే ఉద్యోగాలు చేసుకుంటే మంచిది


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు డిగ్రీ చదువుతున్న సమయంలోనే పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటే ఆ సొమ్ము విద్యకు ఉపయోగపడడమే కాకుండా తల్లిదండ్రులకు ఆసరాగా కూడా ఉంటుందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవ వేడుకల్లో ఈ-క్లాస్ రూమును ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ చదువుతో పాటు స్థానికంగా ఉండే మెడికల్, ఇంజనీరింగ్ వర్క్ షాపుల్లో పని చేస్తే స్కిల్స్ పెరుగుతాయన్నారు. తద్వారా చదువు పూర్తయిన అనంతరం అటువంటి వ్యాపారాలు సొంతంగా కూడా పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ పాల్గొన్నారు.

రాయిపేటలో సమస్యల తిష్ట

● పొంగుతున్న డ్రెయిన్లు ● అధ్వానంగా పారిశుద్ధ్యం

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో మౌలిక వసతుల సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులు చేశామని చెప్పుకోవడమే తప్ప, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఏ విధంగా ఉందో రాయిపేటను చూస్తే అర్థమవుతుంది. పైగా పట్టణంలో రాయిపేటను ప్రధానమైన ప్రాంతంగా చెప్పుకుంటారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో డ్రెయిన్స్, పారిశుద్ధ్య సమస్యలు చాలా కాలంగా పరిష్కారం కావడం లేదు. ఇటీవల ఈ సమస్య మరింత తీవ్రమైంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

వేధిస్తున్న డ్రెయిన్ల సమస్య

రాయిపేట మొత్తంగా ఎక్కడా కూడా డ్రెయిన్స్ సవ్యంగా లేవు. పూర్వం నిర్మించిన డ్రెయిన్లు శిథిలమయ్యాయి. అవుట్‌లెట్స్ సరిగ్గాలేవు. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. అదీకాక ఈ ప్రాంతంలో ఈ మధ్యకాలంలో ఒక్క మేజర్ డ్రెయి న్ కూడా కొత్తగా నిర్మించలేదు. మరోవైపు పాత డ్రెయిన్స్ లెవెల్స్ సరిగా లేకపోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. ప్రతి డ్రెయిన్‌లోనూ మురుగు, రోడ్డుమీదకు ప్రవహిస్తోంది. కొత్త డ్రెయిన్స్ నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఆర్డీఓ, డీఎస్పీనుంచి ఇతర ఉన్నతస్థాయి అధికారులు, బడా కాంట్రాక్టర్లు, పెద్దపెద్ద వ్యాపారులు అత్యధికంగా ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న పరిస్థితి మాత్రం దారుణంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. రాయిపేటలో ప్రతిచోటా 60 అడుగుల వెడల్పుతో విశాలమైన రోడ్లు ఉంటాయి. అయితే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలు దర్శమిస్తుంటాయి. పైగా ఇటీవల రోడ్లపై పందులు సంచరిస్తున్నాయి. మరోవైపు కుక్కల బెడదతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. వీధిలైట్లు కూడా సవ్యంగా వెలగడం లేదు. రాత్రయితే దొంగల భయంతో వణికిపోతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధు లు స్పందించి రాయిపేటలో సమస్యలను పరిష్కరించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.


అధ్వానంగా ఉన్న బీజీబీఎస్ మహిళా కళాశాల రోడ్డు